

గ్రంథాలయంలో యోగా పోటీలు



యోగాసనాలు వేస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరాల్లో భాగంగా స్థానికశాఖ గ్రంథాలయంలో మంగళ వారం విద్యార్థులు చిన్నారులకు యోగ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిని ఎస్ సునీత మాట్లాడుతూ యోగ చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మనసు ప్రశాంతంగా ఉంటుందన్నారు. యోగ వల్ల కలిగే ప్రయోజనాలపై చిన్నారులకు వివరించి, వారితో ఆసనాలను వేయించామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది కె.చిన్నారావు విద్యార్థులు చిన్నారులు పాల్గొన్నారు.

మోదమ్మ జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

అధికారులు, ఉత్సవ కమిటీతో సమీక్షలో కలెక్టర్ దినేష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్ కుమార్

ప్రజాశక్తి పాడేరు : ఈ నెల 11,12,13 తేదీలలో నిర్వహించనున్న మోదకొండమ్మ జాతరలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు తావు లేకుండా అన్ని ముందస్తు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు.. మంగళవారం ఉత్సవ కమిటీ సభ్యులు జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ జాతర సందర్భంగా అమ్మవారి గుడి నుండి శతకంపట్టు వరకు అమ్మవారి విగ్రహం, పాదాలు, ఘటాలు తిరిగే సందర్భంలో ఎటువంటి తోక్కిసలాటకు అవకాశం లేకుండా అందరికీ దర్శన భాగ్యం కలిగే విధంగా చర్యలు చేపట్టాలనానరు. క్రౌడ్, ట్రాఫిక్, ట్రాన్స్‌పోర్ట్ మేనేజ్మెంట్ జాగ్రత్తగా చేపట్టాలని, తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. ఉత్సవాల మూడురోజులూ 24 గంటల విద్యుత్ సరఫరా జరగాలని, పారిశుధ్య నిర్వహణ సక్రమంగా ఉండాలని,అశ్లీలతకు తావు లేకుండా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిఐపిల సందర్శన ముందుగానే తెలుసుకొని ప్రోటోకాల్ ప్రకారం దర్శనం కల్పించాలని, స్త్రీ, శిశు రక్షణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెంట్రల్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి పోలీస్, రెవెన్యు, నీటి సరఫరా, పంచాయతి, ఐ అండ్ పిఆర్, తదితర శాఖల సిబ్బందిని డిప్యూట్ చేయాలని ఆదేశించారు. ఉత్సవం మూడు రోజులు పాడేరు పట్టణానికి బయట పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేయాలని సూచించారు. స్కౌట్స్, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ నెల 10 నుంచి 13 వరకు ఉత్సవాల నాలుగురోజులూ పాడేరులో మద్యం షాపులు మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఉత్సవాల మూడు రోజులూ పాడేరు ఘాట్‌రోడ్డులో భారీ వాహనాల రాక పోకలు నిషేధిస్తున్న నేపథ్యంలో వ్యాపారులందరూ ముందుగానే అవసరమైన సరుకులను తెప్పించుకోవాలని కలెక్టర్ సూచించారు సమావేశంలో ఎస్పి అమిత్ బర్ధర్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగ వెంకట సాహిత్, డిఆర్ఒ కె. పద్మలత, ఎస్‌డిసి ఎంవిఎస్. లోకేశ్వరరావు, డిఎస్పి షేక్ సహబాజ్ అహమ్మద్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, జిల్లా అధికారులు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొణతాల ప్రశాంత్, కూడా సురేష్ కుమార్, కేజ రాణి, పల్ల రామకృష్ణ, బేరా నాని, తమర్భ ప్రసాద్‌నాయుడు, మచ్చ కొండబాబు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై అవగాహన



ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అవగాహనలో బాలికలు

ప్రజాశక్తి- హుకుంపేట: బాలికలకు విద్యపై ఆసక్తిని పెంచడంతోపాటు 12 అంశాలపై అవగాహనకు నెలరోజులపాటు కిశోర వికాసంపై అవగాహన కల్పిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఒ బాలామణిదేవి సూచించారు. మంగళవారం మండలంలోని దుర్గం పంచాయతీ ధారగడ్డ గ్రామంలో కిశోరవికాసంపై బాలికలకు అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతూ, కౌమార దశలో ఉన్న బాలిలకు తలెత్తే ఆరోగ్య సమస్యలతో పాటు ఇతర సమస్యలపైవారికి అవగాహన కల్పించి, వాటిని ఎదుర్కొనేందుకు సన్నద్ధం చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తోందన్నారు.

పనిప్రదేశంలో బాలికలకు లైంగిక వేధింపులు, బాల కార్మిక వ్యవస్థ, బాల్యవివాహాల అనర్థాలు, రుతుక్రమం, ఇతర ఆరోగ్య సమస్యలపై అవగాహన వంటి అంశాలను ఈ కార్యక్రమంలో భాగంగా బాలికలకు అవగాహన కల్పిస్తామన్నారు. గ్రామాల్లోని 18ఏళ్లలోపు కిశోర బాలికలను గ్రూపులుగా విభజించి, వారిలో వారు పరస్పరం చర్చించుకోవడం ద్వారా సమస్యలపై అవగాహన పెంచుకునేలా చైతన్యపరుస్తామన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

ఇలా ఉంటే వ్యాధులు రావా?

- డ్రెయినేజీల్లో మురుగునీటి నిల్వలు
- దోమల బెడదతో గిరిజనం అవస్థలు
- ఫిర్యాదు చేసినా పట్టని అధికారులు



డ్రైనేజీల్లో నిల్వ ఉన్న మురుగునీరు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డుకు ఆనుకుని ఉన్న డ్రైనేజీల్లో వర్షపు నీరు నిల్వ ఉండి, మురిగి దుర్గంధభరితమై దోమలకు ఆవాసంగా మారి స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందనే విమర్శలు వినిపిస్తున్నాయిజాతీయ రహదారి నిర్మించక ముందు అక్కడ డ్రైనేజీకాలువలను నిర్మించారు. అయితే ప్రస్తుతం జాతీయ రహదారి ఏర్పాటు తర్వాత అక్కడే వేరేగా కాలువలు నిర్మించడంతో గతంలో నిర్మించిన డ్రైనేజీ కాలువలు వదిలేశారు. దీంతో ఆయా కాలువల్లో వర్షం కురిస్తే నీరంతా చేరిపోయి రోజుల తరబడి నిల్వఉండడంతో దుర్గంధభరితంగా మారుతోంది. వీటిని పంచాయతీగానీ, సంబంధిత అధికారులు గానీ పట్టించుకోకపోవడంతో, పాతడ్రైనేజీలో నిల్వ ఉన్న నీటిలో చెత్తాచెదారం చేరిపోయి, మొత్తం మురిగిపోయి దోమలకు ఆవాసంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. వర్షాలు కురిసినప్పుడు పాత డ్రైనేజీల్లోని నీరు బయటకు మళ్లిపోయే మార్గం లేకపోవడం వల్లే ఈ దుస్థితి నెలకొందని అంటున్నారు.

రోజులతరబడి నిల్వ ఉన్న వర్షపు నీటిలో దోమలు వృద్ధి చెంది అల్లాడిస్తున్నాయనిపరిసర ప్రాంత నివాసితులు ఆవేదన చెందుతున్నారు. దోమలు విజృంభణతో మలేరియా, డయేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం వుందని ఆందోళన చెందుతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. తక్షణమే అధికారులు స్పందించి పాత డ్రైనేజీ కాలువల్లో వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టి, దుర్గంధం, దోమల బెడద నుంచి విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ఆశా కార్యకర్తల సమ్మె నోటీసు



ఆశాలతో సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నేత పోతురాజు

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా నాయకుడు ఎస్‌బి పోతురాజు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు దేశవ్యాప్త సమ్మెలో పాల్గొనేందుకు వీలుగా సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక వైద్యాధికారికి ఆశా కార్యకర్తలు సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా పోతురాజు మాట్లాడుతూ ఆశాలకు సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనం రూ 26వేలు చెల్లింపు, ఇతర సౌకర్యాలను కల్పించాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో అన్నివర్గాల కార్మికులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అనంతగిరి : ఈనెల 20న దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, కర్షకులు అన్నివర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని స్థానిక జెడ్‌పిటిసి దీసరి గంగరాజు, సిఐటియు మండల కార్యదర్శి కిల్లో మొస్య, సిపిఎం మాజీ సర్పంచ్ కొండలరావు పిలుపు నిచ్చారు మంగళవారం మండలంలోని పలు ఆరోగ్య కేంద్రాల్లో ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులతో సమ్మె సన్నద్ధతపై సమావేశాలు నిర్వహించారు. స్థానిక పిహెచ్‌సిలో వైద్యాధికారికి సిపిఎం జెడ్‌పిటిసి దీసరి గంగరాజు ఆధ్వర్యంలోనూ లుంగపర్తిలో మాజీ సర్పంచ్ సివేరి కొండలరావు ఆధ్వర్యంలో ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు సమ్మె నోటీసు అందజేశారు.

ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ఇతర కార్మిక సమస్యలపై చేపట్టే సమ్మెలో ఆశాలు, సిహెచ్‌డబ్ల్యులు, ఇతర సంస్థల్లోని కార్మికులు స్వచ్ఛందంగా సమ్మె లో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జేష్ఠ వెంకటరమణ, పాంగి రాజారావు ఆశా వర్కర్లు సింహాచలం, జె.పద్మ,దేముడుమ్మ, రాజేశ్వరి, ఎన్.సుందరి పాల్గొన్నారు



వైద్యాధికారికి సమ్మె నోటీసు అందజేస్తున్న ఆశాలు

సిహెచ్ఒల సమ్మె ఉధృతం

- తొమ్మిదో రోజున పాడేరులో భారీ ర్యాలీ
- కలెక్టరేట్ వద్ద నిరసన, వినతిపత్రం అందజేత



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సిహెచ్ఒలు

ప్రజాశక్తి-పాడేరు: ఆయుష్మాన్ భారత్ నిబంధనల మేరకు ఆరేళ్లకుపైగా విధులు నిర్వహిస్తున్న తమను రెగ్యులర్ చేయాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు (సిహెచ్ఒ) లు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రవ్యాప్త సమ్మె తొమ్మిదోరోజున . మంగళవారంసమ్మెను ఉధృతం చేశారు పాడేరులో భారీ ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ గేటు వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించి తమ డిమాండ్లపై నినాదాలు చేశారు అనంతరం జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్‌కు తమ సమస్యల్ని ఏకరువు పెట్టారు. ఈ సందర్భంగ వారు మాట్లాడుతూ, ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు సర్వీస్ పూర్తి చేసుకున్న సిహెచ్ఒలను రెగ్యులర్ చేయాలని, ఎన్‌హెచ్ఎం ఉద్యోగులతో సమానంగా 23శాతంవేతన సవరణ చేయాలని, పని ఆధారిత ప్రోత్సాహకాలను క్రమబద్ధీకరి ంచాలని, ఇపిఎఫ్ఒ పునరుద్ధరించాలని, క్లినిక్ అద్దె బకాయిలను వెంటనే చెల్లించి క్రమబద్ధీకరిం చాలని, నిర్దిష్టమైన జాబ్ చార్ట్ అందించాలని, ఎఫ్ఆర్ఎస్ నుండి సిహెచ్ ఒలకు మినహాయింపు నివ్వాలని, హెచ్ఆర్ పాలసీ ఇంక్రిమెంట్ ట్రాన్స్‌ఫర్, అదనపు విత్తృత్వ సెలవులు అమలు, ఇతర డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. సిహెచ్ఒల వినతిపై జిల్లా కలెక్టర్ స్పందిస్తూ, వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్‌తో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ఒల అసోసియేషన్ జిల్లా నాయకులు దుర్గ భవాని చంద్రకళ పవన్ కల్యాణ్ పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న సిహెచ్ఒలు

ప్రజా సమస్యలు పరిష్కరించండి

- సర్వసభ్య సమావేశంలో అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు
- పరిష్కరిస్తామని హామీ



మాట్లాడుతున్న విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి

ప్రజాశక్తి-వి.ఆర్.పురం: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం రేఖపల్లి మండల ప్రజాపరిషత్ సమావేశ భవనంలో మంగళవారం నిర్వహించారు. ఎంపిపి కారం లక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపిటిసిలు అధికారులు హాజరయ్యారు. ఎంపిపి కారంలక్ష్మి, జెడ్పిటిసి, వాళ్ల రంగారెడ్డి మాట్లాడుతూ వేసవి కారణంగా మండలంలో కొన్నిచోట్ల తాగునీటి సమస్య ఉందని సంబంధిత అధికారులు పరిష్కరించాలని సూచించారు. శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విఆర్‌పురం బిసి కాలనీ నుంచి రేకపల్లి తహశీల్దార్ కార్యాలయం వరకూ వెట్‌మిక్స్ చేసి వదిలేసిన రోడ్డుకు తారు ఎప్పుడు వేస్తారని సంబంధిత అధికారిని నిలదీశారు. ఆ శాఖ నుంచి హాజరైన ప్రవీణ్ మాట్లాడుతూ వారం రోజుల్లో తారువేసే పనులు మొదలుపెడతామన్నారు. గుర్రంపేట చినమట్టపల్లి గ్రామాల్లో విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్ స్తంభాలు వేసి కనెక్షన్ ఇవ్వలేదని చిన్నమట్టపల్లి ఎంపిటిసి పూనం ప్రదీప్‌కుమార్ ప్రశ్నించారు. స్పందించిన అధికారులు నాలుగు రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. సమావేశానికి ఎంపిడిఒ ఆంజనేయులు, వైస్ఎంపిపిలు ముత్యాల భవాని, వడ్డాణపు భాగ్యలక్ష్మి ఎంపిటిసిలు వాళ్ల వెంకటేశ్వర్‌రెడ్డి, సర్పంచులు పూనం సరోజిని, వెట్టి లక్ష్మి కారం బుచ్చమ్మ, వడ్డాణపు శారద, సోడే నరసమ్మ, పిట్టా రామారావు, ముట్ల బాలరాజు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు

100 శాతం ఉద్యోగాలు స్థానికులకే ఇవ్వాలి

మెగా డిఎస్‌సి నుంచి ఏజెన్సీ ప్రాంత టీచర్ పోస్టులు మినహాయించి ప్రత్యేక ఏజెన్సీ డిఎస్‌సి ద్వారా భర్తీ చేయాలని కోరారు. జిఒ నంబర్ 3 బదులుగా దానికి సమానమైన జిఒ తీసుకువచ్చి చట్టం చేయాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 100 శాతం ఉద్యోగాలు స్థానిక ఆదివాసులకే ఇవ్వాలని కోరారు. ఈ మేరకు మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేశారు.

మెగా క్రికెట్ టోర్నీ విజేత రంపచోడవరం

రూ.40 వేలు నగదు, షీల్డ్ అందజేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: మండలంలో జడ్డంగి గ్రామంలో మంగళవారం నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతగా రంపచోడవరం దినేష్ లెవెన్ జట్టు విజయం సాధించింది. 40 రోజులుగా జడ్డంగిలో జరుగుతున్న ఈ టోర్నమెంట్ లో 53 జట్లు పోటీపడ్డాయి. ఫైనల్స్‌లో జడ్డంగి స్టార్ లెవెన్ జట్టు, దినేష్‌లెవెన్ జటు తలపడ్డాయి.రంపచోడవరం జటు 12 ఓవర్లకు 67 పరుగులు చేసి అలౌట్ అయింది. జడ్డంగి జటు 12 ఓవర్లకు 57 పరుగులు చేయగా 10 పరుగులు తేడాతో రంపచోడవరం జట్టు విజయం సాధించింది. మ్యాన్ అఫ్ ది మ్యాచ్‌గా నాని,మ్యాన్ అఫ్‌ది సిరీస్ ప్రవీణ్, బెస్ట్ ప్లేయర్ వల్లూరి చిన్నకు షీల్డ్ మెడల్స్‌ను నిర్వాహకులు అందించారు. విన్నర్ రంపచోడవరం జట్టుకు షీల్డ్, రూ.40 వేలు చెక్ గ్రామపెద్దలు నిర్వాహకులు అందించారు. రన్నరప్ జడ్డంగి జట్టుకు రూ.20 వేలు చెక్, షీల్డ్ అందించారు. క్రీడాకారులకు డ్రింక్‌లు వూర కామేశ్వరరావు, క్రికెట్‌బాల్స్‌ను కొప్పిలి సత్యనారాయణరెడ్డి, మెమోంటోలను ఆద్య రమేష్ ఏర్పాటు చేశారు. విన్నర్, రన్నర్ కప్‌లను వల్లూరి మణికంత, గండేపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఏర్పాటు చేశారని కమిటీ సభ్యులు తెలిపారు.మ్యాన్ అఫ్‌ద మ్యాచ్, మ్యాన్ అఫ్‌ద సిరీస్‌కు నగదు ప్రోత్సాహకాన్ని ఉపాధ్యాయులు, అడపా కామేశ్వరరావు ప్రత్యేకంగా అందించారు. టోర్నమెంట్ నిర్వహించటానికి సహకరించిన యువతకు ప్రత్యేకంగా షీల్డ్‌లు అందించారు. స్థానిక పెద్దలు కూడా నగదు సహకారం అందించారు. జడ్డంగి సర్పంచ్ కొంగర మురళీకృష్ణ, జెడ్‌పిటిసి వడుగుల జ్యోతి, గణజాల తాతారావు, సింగిరెడ్డి రవి, మాజీ సొసైటీ అధ్యక్షులు గణజాల తాతారావు, గ్రామస్తులు కాళ్ళకూరి రాంబాబు, వూర నానాజీ, గుడివాడ రాజేష్, దొంగర శ్రీనివాస్, కె.దుర్గబాబు,డా.ఎల్ దుర్గబాబు, కానెం బాబ్జి, లకంసాని మల్లిబాబు క్రీడాకారులు పాల్గొన్నారు.



విజేత జట్టుతో గ్రామస్తులు



ఏసుపాక వరణ్‌ను అభినందిస్తున్న దృశ్యం

లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగండి

ప్రజాశక్తి-కూనవరం: ప్రతివిద్యార్థి లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగాలని కూనవరం అటవీశాఖ అధికారి కరుణాకర్ సూచించారు. పదోతరగతి పరీక్ష ఫలితాల్లో మండలంలో టాపర్‌గా నిలిచిన ఏసుపాక వరుణ్‌ను మంగళవారం స్థానిక కూనవరం ప్రెస్‌క్లబ్ లో ఘనంగా సన్మానించారు. ఏజెన్సీలో ఆణిముత్యాల్లాంటి విద్యార్థులు ఉన్నారని వారిని వెలికి తీయాలన్నారు. ఈ సందర్భంగా ఏసుపాక వరుణ్ ఆయన తల్లిదండ్రులు ఏసుపాక రవికుమార్, దుర్గలను మండల విద్యాశాఖాధికారి లక్ష్మయ్య, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు పరిటాల వెంకట్, రేంజర్ కరుణాకర్ సన్మానించారు. కార్యక్రమంలో డిఆర్ఒ అనిల్, కృష్ణ, లోకేష్, వినయ్ ప్రసాద్, నవీన్, ఇంతియాజ్, నాగబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



బోనాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి

పట్టాలమ్మ పండగలో ఎమ్మెల్యే బోనాలు

ప్రజాశక్తిరాజవొమ్మంగి : మండలంలోని ఒట్టిగడ్డ గ్రామంలో జరుగుతున్న పట్టాలమ్మ తల్లి ఉత్సవంలో రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి, విజయభాస్కర్ దంపతులు పాల్గొన్నారు. స్థానిక మహిళలతో ఎమ్మెల్యే శిరీషదేవి మంగళవారం పట్టాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, గ్రామస్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఉత్సవాల్లో పాల్గొనడం ఆనందంగా ఉందని శిరీషదేవి అన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు.

బిసి మహిళలకు కూటమి ప్రభుత్వం శఠగోపం



మాట్లాడుతున్న మరియదాసు


ప్రజాశక్తి-కూనవరం: బిసి మహిళలకు కూటమి ప్రభుత్వం శఠగోపం పెట్టిందని కుట్టుమిషన్ల శిక్షణ పథకం పేరుతో కొనుగోలులో భారీ కుంభకోణానికి పాల్పడిందని వైసిపి బిసిసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవుల మరియదాసు ఆరోపించారు. బిసి నాయకులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లక్ష మంది బిసి లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి రూ.23 వేలు ఈ పథకం ద్వారా అందిస్తామంటూ చెప్పిన కూటమి ప్రభుత్వం నాసిరకం కుట్టుమిషన్లను అందించారని మొత్తం రూ.167 కోట్లు కుంభకోణం జరిగిందని విమర్శించారు. కార్యక్రమంలో బిసి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ గంగాధర్ , చెవుడు బోయిన మధు, చామంతుల వెంకన్న, మైనారిటీ కార్పొరేషన్ అధ్యక్షులు మహమ్మద్ రహమతుల్లా పాల్గొన్నారు.

దోమల మందు పిచికారి



దోమలమందు పిచికారి చేస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి-విఆర్‌పురం: మండలంలోని ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం రేఖపల్లి పరిధిలో డాక్టర్ అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో మలేరియా ప్రభావిత గ్రామాల్లో మొదటి విడత దోమల మందు పిచికారి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ మందు పిచికారి చేయడం వల్ల మలేరియా, డెంగ్యూ నుంచి రక్షణ పొందవచ్చన్నారు. దోమతెరలు వాడాలని సూచించారు. ఎంటిఎస్‌రాజేష్ ఎంపిహెచ్ఈఒ సమ్మయ్య హెచ్ఎలు శ్రీనివాస్,సత్యనారాయణ, పార్వతి ఆశలు నూతన రాధా పాల్గొన్నారు.




ఉపాధిపనులు పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

ఉపాధి కూలీలకు సౌకర్యాలు కరువు

ప్రజాశక్తి,కూనవరం: రేపాకలో ఉపాధిపనులను సిపిఎం నాయకులు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి వేతనదారులు మనిషికి రోజుకు 3 మీటర్లు పొడవు ఇచ్చి తవ్వమంటున్నారని, మొత్తం కలిపితే ఒక మనిషికి రోజుకి రూ.300 వస్తోందని గతంలో తక్కువ కొలతలు ఇచ్చేవారని, 260నుంచి రూ.280 వేతనం వచ్చేదని ఇప్పుడు శ్రమ పెరిగిందని వాపోయారు. జిల్లా కమిటి నాయకులు మేకల నాగేశ్వరరావు మాట్లడుతూ గతంలో ఉన్న సౌకర్యాలు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కల్పిచటంలేదని విమర్శించారు. గత కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి 100 శాతం నిధులు కేటాయించేదని, ఇప్పుడు 30 శాతానికి తగ్గించారని ఆరోపించారు. కనీసం ఒక మనిషికి రోజుకి రూ.500 నుంచి 600 వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పాయం సీతారామయ్య, మండల కార్యదర్శి బాబుబోర్రయ్య, మాజీ సర్పంచ్ మడకంబోజ్జి, సత్యనారాయణ పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలను తక్షణమే తొలగించాలి



మాట్లాడుతున్న లోతా రామారావు

ప్రజాశక్తి- మారేడుమిల్లి: మారేడుమిల్లి, సున్నంపాడులో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను తొలగించాలని, వారి మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోతా రామారావు డిమాండ్ చేశారు. మంగళవారం సమావేశం నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న రిసార్ట్స్, కాటేజీలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులకు ఎలా అనుమతులు ఇస్తారని ఆయన ప్రశ్నించారు. సరైనచర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఈతపల్లి సిరిమల్ రెడ్డి, తీగల శ్రీను, విద్యాసాగర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు

హామీల అమలులో కూటమి వైఫల్యం

ప్రజాశక్తి –జికె వీధి: జిఒ3 ప్రయోజనాల పునరుద్ధరణకు ప్రత్యామ్నాయ చర్యలు చేపడతామని ఎన్నికలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చకుండా, ప్రజలను పక్కదోవ పట్టించడానికి జిఒ3 రద్దుపై వైసిపిని నిందించడం తగదని ఆ పార్టీ మండల అధ్యక్షులు కంకిపాటి గిరి ప్రసాద్ అన్నారు. ఈ సందర్భంగా కంకిపాటి గిరిప్రసాద్ మాట్లాడుతూ, వైసిపి హయాంలో జిఒ3ను సుప్రీంకోర్టు రద్దు చేసినా, అప్పటి వైసిపి ప్రభుత్వం గిరిజన సలహా మండలి సమావేశం ఏర్పాటు చేసి, కేబినెట్లో చర్చించి సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసినా దాన్ని న్యాయస్థానం డిస్మిస్ చేసిందన్నారు. ఇవన్నీ తెలిసి అరకు సభలో సిఎం చంద్రబాబు జిఒ 3 పునరుద్ధరణపై హామీ ఇచ్చారని, ఇపుడు మెగా డిఎస్సి ప్రకటన తర్వాత ఆందోళనలు రేగిన నేపథ్యంలో ఇచ్చిన మాటను నిలబెట్టుకోకుండా విషయాలపై బురద చల్లి తప్పుకోవాలనుకోవడం సరికాదన్నారు. వైసిపి నేతలు రీమల బాలకృష్ణ, వంతల చంటిబాబు, పాతాని లక్ష్మణ్, ముచ్చల చిన్నబ్బాయ్య, స్వామినాధం, వంతల రాజారావు ఉన్నారు.

ముగిసిన మోదకొండమ్మ జాతర

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక మోదకొండమ్మ జాతర మంగళవారంతో ముగిసింది..జాతర ముగింపు సందర్భంగా మంగళవారం తెల్లవారుజాము నుంచే అధికసంఖ్యలో భక్తులు ఘటాలతో అమ్మ వారి ఆలయానికి చేరుకుని పూజ కార్యక్రమాలు నిర్వహించి మొక్కుబడులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాలు, డ్యాన్స్‌లతో అమ్మవారి ఆలయం వద్ద కోలాహలం నెలకొంది. మధ్యాహ్నం 2 గంటల వరకు భక్తులు క్యూలో ఉండి మొక్కుబడులు తీర్చుకున్నారు. దూర ప్రాంతాల నుంచి, మైదాన ప్రాంతం నుంచి వచ్చే భక్తుల సౌకర్యం కమిటీ సభ్యులు ఆలయం వద్ద తగిన ఏర్పాట్లు చేశారు. స్థానిక సిఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు కల్పించారు.


ఘటాలతో మోదమ్మ దర్శనానికి బారులు తీరిన భక్తులు

మొరాయిస్తున్న బిఎస్ఎన్ఎల్ సేవలు

అవస్థలు పడుతున్న వినియోగదారులు పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు

ప్రజాశక్తి–చింతపల్లి: విద్యుత్; ఇతర సాంకేతిక సమస్యలతో బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు అలంకారప్రాయంగా మారుతున్నాయని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వరంగ సంస్థలకు మద్దతుగా ఉందామని కొందరు, టారిఫ్ తక్కువగా ఉందని మరికొందరు, రేడియేషన్ నియంత్రణలో ఉంటుందని ఇంకొందరు ఇలా ఎక్కువమంది బిఎస్ఎన్ఎల్ వినియోగదారులుగానే కొనసాగుతుండగా, సిగ్నల్స్ సమస్యలతో తరచూ ఫోన్లు మొరాయిస్తుండడంతో అనేకమంది విసుగు చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలను క్రమబద్ధీకరించాలని కోరుతున్నారు.

మండల కేంద్రం చింతపల్లితోపాటు కొమ్మంగి, కృష్ణాపురం, తదితర గ్రామాల్లో నాలుగేళ్ల క్రితం బిఎస్ఎన్ఎల్ సెల్‌టవర్లు ఏర్పాటు చేశారు. మొదటి రోజు నుంచీ ఏదో ఒక సమస్యతో తరచూ సెల్‌సిగ్నల్స్‌కు అంతరాయం ఏర్పడుతూ వినియోగదారుల సహనాన్ని పరీక్షిస్తున్నారని స్థానికులు వాపోతున్నారు.

మన్యంలోని గ్రామీణ ప్రాంతంలో బిఎస్ఎన్ఎల్‌తోపాటు జియో సెల్ సేవలు అందుబాటులో ఉన్నాయి. నెలసరి ఛార్జీలు తక్కువగాఉండడంతో నేటికీ బిఎస్ఎన్ఎల్ సేవలనే ఎక్కువమంది కొనసాగిస్తున్నారు. అయితే విద్యుత్, ఇతర సాంకేతిక సమస్యలతో తరచూ సిగ్నల్స్ మొరాయిస్తున్నాయి. దీంతో వినియోగదారులు తీవ్ర ఆవేదన చెందుతున్నారు. ప్రత్యామ్నాయంగా జియో సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ అనేకమంది నేటికీ బిఎస్ఎన్ఎల్‌లోనే కొనసాగుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, బిఎస్ఎన్ఎల్ సెల్ సేవలను క్రమబద్ధీకరించి, ఎటువంటి అవాంతరం లేకుండా సేవలు అందించాలని కోరుతున్నారు. మరోవైపు ప్రైవేటు ప్రొవైడర్స్ 5జీ సేవలను అందించడంతోపాటు వాటిని మెరుగుపరిచే దిశగా ముందుకు సాగుతుంటే, నేటికింకా 2జీ, 3జీలోనే


పనిచేయని బీఎస్ఎన్ఎల్ సెల్ టవర్

ఉండడం సరికాదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఆధునికీకరించి ప్రయివేటు సెల్ టవర్స్ ప్రారంభోత్సవాల్లో పాల్గొంటున్న ప్రధాని మోడీతోపాటు ఇతర మంత్రులు, నేతలు, ప్రభుత్వరంగ బిఎస్ఎన్ఎల్ సేవలను అప్‌డేట్ చేయడంలో ఎందుకు తాత్కారం చేస్తున్నారని మన్యవాసులు ప్రశ్నిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

వివాహిత ఆత్మహత్య



ప్రజాశక్తి–ఉక్కునగరం : దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధి అగనంపూడి గల్లవానిపాలెంలో వివాహిత ఆత్మహత్య చేసుకుంది. శ్రీవైష్ణవి ఆర్కేడ్ అపార్ట్‌మెంట్ టెర్రస్ పైనుంచి దూకి గుడ్ల కమల కుమారి (58) ఆత్మహత్య చేసుకుంది. ఫార్మసిటీలో పనిచేస్తున్న ఆమె భర్త గళ్ల వెంకట మురళి (60) గత నెలలోనే మృతి చెందాడు. తర్వాత స్వస్థలమైన విజయవాడ వెళ్లారు. ప్రస్తుతం గల్లావానిపాలెంలోని కుమార్తె, అల్లుడు వద్ద ఆమె ఉంటుంది. ఈనెల నాలుగో తేదీన విజయవాడ నుంచి వచ్చిన నుంచి ముభావంగా ఉంటున్న ఆమె మనస్థాపంతో మంగళవారం ఉదయం టెర్రస్ పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి –ఆనందపురం : మండలంలోని గంభీరం జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక మహిళ మృతి చెందారు. భోగాపురం మండలం పోలిపిల్లికి చెందిన మామిడి రామలక్ష్మి (46) మంగళవారం బోయపాలెం నారాయణ కళాశాలలో చదువుతన్న తన చెల్లి కుమార్తెను కలవడానికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ఇంటికి వస్తున క్రమంలో గంభీరం ఫ్లైఓవర్ దాటిన తర్వాత ద్విచక్ర వాహనం నుంచి పడిపోయారు. తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందారు. ఈమె భర్త గతంలోనే మృతిచెందారు. ఈమెకు ఇద్దరు కుమార్తెలున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

40 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి –కోటవురట్ల: మండలంలో ఎండపల్లి గ్రామం వద్ద సోమవారం రాత్రి కారులో గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అలాగే స్కూటీపై గంజాయితో మరో వ్యక్తి కలిపి నలుగురిని పట్టుకున్నట్లు స్థానిక ఎస్ఐ రమేష్ తెలిపారు. నిందితుల నుంచి 40కిలలో గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఉత్తరప్రదేశ్ కు చెందిన ముగ్గురు వ్యక్తులు, చింతపల్లి మండలానికి చెందిన మరొక వ్యక్తిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

విద్యుదాఘాతంతో మహిళా రైతు మృతి

ప్రజాశక్తి–కశింకోట : మండలంలోని జె.తుని పంచాయతీ నరసింగబిల్లి గ్రామానికి చెందిన చవితిని చిలకమ్మ (54) మంగళవారం విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. ఎఎస్ఐ రమణమ్మ అందించిన వివరాలు ప్రకారం... చవితిని చిలకమ్మ గొబ్బురు పాలెంలో ఉన్న తమ పొలానికి మంగళవారం ఉదయం 10 గంటలకు వెళ్లింది. చెరుకు తోట తడిపేందుకు చిలుకమ్మ మోటార్ ఆన్ చేయగా, ఒక్కసారికి ఆమె విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. దీనిపై ఆమె కుమారుడు రమణబాబు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎఎస్ఐ రమణమ్మ తెలిపారు. కాగా మృతురాలు చిలకమ్మకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

రీసర్వేలో జాప్యం చేస్తే ఉపేక్షించం

జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్

ప్రజాశక్తి –పాడేరు : భూములు రీ సర్వే ప్రక్రియ జాప్యం చేస్తే ఉపేక్షించబోనని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి 22 మండలాల రెవెన్యూ, సర్వే అధికారులతో వారాంతపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వే ప్రక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని సూచించారు.. గ్రామసభల్లో అందిన దరఖాస్తులను సకాలంలో పరిష్కరించాలని, మ్యుటేషన్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. రీసర్వేలో భాగంగా సంబంధిత అధికారులు లాగిన్ అయి పెండింగ్ లేకుండా చూడాలని, ఎవరి లాగిన్‌లో పెండింగ్ ఉంటె వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కలెక్టర్ అడిగిన ప్రశ్నలపై సరిగా స్పందించని ముంచింగిపుట్టు తహసిల్దార్‌కు షోకాజ్ నోటీస్ జారీ చేయాలని డిఆర్ఒను ఆదేశించారు. గత వారం నుండి ఇప్పటివరకు నిర్వహించిన సర్వే, తీసుకున్న చర్యలపై ఆరా తీసారు. ప్రతి వారం కలెక్టర్ సమీక్షకు ముందుగానే తహసిల్దార్లు సంబంధిత సిబ్బందితో సమీక్షించి కలెక్టర్ సమీక్షకు పూర్తి వివరాలతో హాజరు కావాలని, అడిగిన ప్రశ్నలకు నీళ్ళు నమిలితే ఊరుకోబోనని హెచ్చరించారు. వచ్చేనెల 15లోగా నోటిఫికేషన్ -13ను జారీ చేసే విధంగా ఐదు వారాల ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రెవెన్యూ సదస్సులలో అందిన విజ్ఞాపనలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. గృహనిర్మాణాల ధరఖాస్తులు పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి శనివారం పబ్లిక్ కన్వియన్స్‌డేగా గుర్తించి ప్రభుత్వ భూములలో ఉన్న ఆక్రమణలను పద్ధతి ప్రకారం తొలగించాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజె. అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, అసిస్టెంట్ కలెక్టర్ కనల చిరంజీవి నాగవెంకట సాహిత్, డిఆర్ఒ కె. పద్మలత, ఎస్‌డిసి ఎంవి.ఎస్. లోకేశ్వరరావు, సర్వే సహాయ సంచాలకులు కె. దేవేంద్రుడు, 22 మండలాల తాహశీల్దారులు సర్వేయర్లు, విఆర్ఒలు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

గ్రామాలలో పారిశుధ్యం మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుండి పంచాయతీ రాజ్, విద్యాశాఖ, గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులు, గృహ నిర్మాణ శాఖ, గిరిజన సంక్షేమం, ఎంపిడిఒలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో శానిటేషన్ కమిటిల సమావేశం నిర్వహించాలన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభించాలని సూచించారు. గిరిజన గ్రామాల్లో క్లాప్ మిత్రాలు ఇంటింటికి తిరిగి చెత్త సేకరణ చేయాలని అన్నారు. చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను వినియోగంలోకి తీసుకుని రావాలని ఆదేశించారు. ప్రథమ్ ఆధ్వర్యంలో ఈనెల 9 నుంచి 5,6 తరగతుల విద్యార్థులకు ఆట పాటలతో అర్ధమెటిక్, తెలుగు, ఆంగ్ల భాషలలో విద్యా నైపుణ్యాలు మెరుగు పరచాలన్నారు. మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్ల సహాకారంతో వాలంటీర్లను గుర్తించి విద్యార్థులకు విద్యను అందించాలన్నారు. ఎంపిడిఒలు, ఎంఇఒలు విద్యా ప్రమాణాలు మెరుగుకు కృషి చేయాలన్నారు. మంజూరు చేసిన తాగునీటి పథకాలు సకాలంలో పూర్తి చేయకపోతే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారుజిల్లాలో 9632 మందికి ఆలస్య జనన ధ్రువీకరణ పత్రాలు జారీ చేయవలసి ఉందని దానిపై దృష్టి పెట్టాలన్నారు 17,685 మందికి ఆధార్ జారీ చేయాల్సి ఉందని,పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి తగు చర్యలు చేపట్టాలన్నారు. జనన ధ్రువీకరణ పత్రాల ఉన్న పిల్లలందరకి ఆధార్ నమోదు చేయాలన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సమావేశంలో జిల్లా పంచాయితీ అధికారి బి. లవరాజు, గ్రామ వార్డు సచివాలయాల నోడల్ అధికారి పిఎస్. కుమార్, గ్రామీణ నీటి సరఫరా విభాగం జవహార్ కుమార్, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీ రావు, హౌసింగ్ ఇఇ బి. బాబు, జిల్లా నైపుణాభివృద్ధి అధికారి రోహిణి, జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రమేష్ కుమార్ రావు, జిల్లా సహాకార అధికారి ఎంవి. రామకృష్ణ రాజు పాల్గొన్నారు.

పురోభివృద్ధిలో సహకార సంఘాలు

ప్రజాశక్తి –పాడేరు: జిల్లాలో సహకార సంఘాలు పురోభివృద్ధి బాటలో నడుస్తున్నాయని జిల్లా సహకార అధికారి ఎంవి.రామకృష్ణరాజు అన్నారు. అంతర్జాతీయ సహకార వారోత్సవాలలో భాగంగా 22 పిఎసిఎస్‌ల సిఇఒలు, సిబ్బందితో నిర్వహించిన సదస్సులో మాట్లాడుతూ, సహకార వారోత్సవాలను గతనెల 23న చింతూరులో కలెక్టర్ దినేష్‌కుమార్ ప్రారంభించగా, వాటిని కొనసాగిస్తున్నామన్నారు. పిఎసిఎస్‌ల కంప్యూటరీకరణ వేగవంతం చేయాలని, ప్రతిసంఘంలోనూ వ్యాపారాభివృద్ధికి ప్రణాళికలు తయారుచేసి, వాటి అమలుద్వారా పిఎసిఎస్‌లు లాభాలబాట పట్టేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో రాజమండ్రి సహకార కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, రిటైర్డ్ డిప్యూటీ రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనులకు శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శిరీషా దేవి

ప్రజాశక్తి– అడ్డతీగల: అడ్డతీగల మండలం డి.భీమవరంలో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష తెలుగుదేశం పార్టీ జెండా ఆవిష్కరించారు. తదనంతరం జల్‌జీవన్‌మిషన్ ద్వారా నిర్వహించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు శిరీష విజయభాస్కర్ దంపతులు భూమిపూజ చేసి, పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో అడ్డతీగల మండల టిడిపి అధ్యక్షులు జర్తా వెంకటరమణరెడ్డి, అన్నం సత్తిబాబు, బిజెపి నాయకులు స్వప్నకుమారి వై.శ్రీనివాస్, వి.సతీష్, నాగబాబు, శ్రీనివాస్‌చౌదరి, రాధాకృష్ణ , మాణిక్యాలరావు, కృష్ణమూర్తి,జి.ఏసుబాబు, బాలయోగి, కె.శ్యామలరావు, చెక్కా శంకర్‌బాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలతో అనర్థాలు

ప్రజాశక్తి–రాజవొమ్మంగి: బాల్య వివాహాలతో అనర్ధాలు చోటుచేసుకుంటాయని స్థానిక సిడిపిఒ ఎల్.దేవామణి అన్నారు. మండలంలోని లబ్బర్తిలో సర్పంచ్ మిరియాల సత్యవతి అధ్యక్షతన బాల్య వివాహాలు వాటి వల్ల కలిగే దుష్ప్రభావాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ దేవమణి మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహం చేయకూడదని అలా చేస్తే శిక్షార్హులన్నారు. డ్రాపవుట్ పిల్లలు గ్రామాల్లో ఉండకూడదన్నారు. గుడ్‌టచ్, బాడ్‌టచ్ గూర్చి హెల్ప్ లైన్ నంబర్స్ కోసం వివరించారు. మహిళా సమైక్య లీడర్ వరలక్ష్మి, ఐసిడిఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, అంగన్‌వాడి, ఆశ వర్కర్లు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న సిడిపిఒ దేవామణి

రోడ్డును పరిశీలించిన ఐటిడిఎ పిఒ

ప్రజాశక్తి– విఆర్‌పురం: విఆర్‌పురం బిసి కాలనీ నుంచి ఎంపిడిఒ కార్యాలయం రేకపల్లి వరకు వెళ్లే రోడ్డులో వెట్‌మిక్స్ వేసి తారు వేయకుండా వదిలేశారు. ఈ విషయంపై ఎంపిపి కారం లక్ష్మి ఫిర్యాదు మేరకు చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వభరత్ మంగళవారం రోడ్డు పరిశీలించారు. త్వరగా పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. సిపిఎం మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, పార్టీ జిల్లా కమిటీసభ్యులు సోయం చినబాబు, కారం సుందరయ్య, పొడియం శ్రీరామమూర్తి, పంకు సత్తిబాబు వడ్లది రమేష్ పాల్గొన్నారు.


రోడ్డును పరిశీలిస్తున్న పిఒ అపూర్వభరత్

నేడు రామజోగయ్య శాస్త్రికి ఆత్రేయ పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి,ఎంవిపికాలనీ: మనసుకవి ఆచార్య ఆత్రేయ 104వ జయంతి సందర్భంగా ప్రముఖ సినీరచయిత రామజోగయ్యశాస్త్రికి బుధవారం ఆత్రేయ పురస్కారం ప్రధానం చేయనున్నట్టు ఆత్రేయ స్మారక కళాపీఠం ప్రధాన కార్యదర్శి గంటి మురళీధర్ మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం సాయంత్రం 5 గంటలకు డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రామజోగయ్యశాస్త్రిని సన్మానిస్తున్నామని ఆయన 400 వందల చిత్రాలకు మాటలు, 1500 పాటలు రాసారన్నారు. అనంతరం ఆత్రేయ రాసిన చిత్రగీతాలతో సంగీత విభావరి ఉంటుందన్నారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మాజీమంత్రులు కిమిడి కళావెంకటరావు, గంటా శ్రీనివాసరావు, ఉపకార్‌ట్రస్ట్ డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తదితరులు పాల్గొనున్నారు.

ఆర్అండ్ఆర్ గ్రామసభలో వినతుల స్వీకరణ

ముంపునకు సంబంధించి అర్హులు, అనర్హుల ప్రకటన


సభకు హాజరైన గ్రామస్తులు


మాట్లాడుతున్న పిఒ అపూర్వభరత్

ప్రజాశక్తి–విఆర్‌పురం: చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి మండల కేంద్రంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామసభలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ముంపు బాధితులకు సంబంధించి అర్హులు, అనర్హుల వివరాలను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పిఒ అపూర్వభరత్ మాట్లాడుతూ మండల కేంద్రంలో మొత్తం 1704 పిడిఎఫ్‌లు గుర్తించగా వాటిలో 1481 పిడిఎఫ్‌లు అర్హులు కాగా 223 అనర్హులుగా గుర్తించామన్నారు. తదుపరి ప్రాజెక్ట్ అడ్మినిస్ట్రేటర్ ధవళేశ్వరం మాట్లాడుతూ అనర్హులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. గ్రామసభ నిర్వహించిన నాటి నుంచి 15 రోజుల వరకూ నిర్వాసితులు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. తదుపరి గ్రామసభలో అనర్హుల నుండి జాబితాలో పేర్లు లేని వారి నుంచి కూడా దరఖాస్తులు తీసుకుంటామన్నారు. గ్రామసభలో తీసుకున్న ప్రతి దరఖాస్తుకు వివరణ ఇస్తామని తెలిపారు. స్పెషల్ డిప్యుటి కలెక్టర్‌లు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు.


జివిఎంసి మెకానికల్ విభాగంపై మేయర్ సమీక్ష


మాట్లాడుతున్న మేయర్ పీలా శ్రీనివాసరావు

ప్రజాశక్తి–ఎంవిపి.కాలనీ: మహా విశాఖపట్నం నగర పాలకసంస్థ మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ మెకానికల్ విభాగంపై మంగళవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మట్లాడుతూ జివిఎంసిలో ఎలక్ట్రికల్ వాహనాలతో పాటు జివిఎంసి సొంత వాహనాలు, అద్దెవాహనాలు ఎన్ని ఉన్నాయని వాటిని ఏఏ అధికారులకు కేటాయించారని మేయర్ ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. నగరంలోని 8జోన్లలో వ్యర్ధాలు తరలించే వాహనాలు ఎన్ని ఉన్నాయి, వాటి నిర్వహణ అలాగే జెసిబిలు, లోడర్లు , బాబ్కట్లు, క్లాప్ వాహనాలు, బీచ్ క్లీనింగ్ యంత్రాలు తదితర వాహనాలు వాటి పనితీరుపై జివిఎంసి పర్యవేక్షక ఇంజనీరు (మెకానికల్) గోవిందరావును అడిగి తెలుసుకున్నారు. బీచ్‌ను శుభ్రం చేసేందుకు బీచ్ క్లీనింగ్ యంత్రాలు ఎన్ని పనిచేస్తున్నాయి వాటి పనితీరును స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. జివిఎంసి వాహనాలకు సంబంధించి అనవసరపు ఖర్చులు తగ్గించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. జివిఎంసిలో నిరుపయోగంగా ఉన్న వాహనాలను వేలం వేసేందుకు ప్రణాళికాయుతమైన చర్యలు తీసుకోవాలని ప్రధాన ఇంజనీర్ పి.శివప్రసాద్‌రాజును మేయర్ ఆదేశించారు. రానున్న వర్షాకాలంలో నగరంలో ప్రధానగెడ్డలు, కాలువల్లో వ్యర్ధాలు, పూడికల తొలగింపు వాటి స్థితిగతులపై ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని, గెడ్డలను స్వయంగా పరిశీలిస్తానని తెలిపారు. సమీక్షలో జివిఎంసి ప్రధాన ఇంజనీర్ శివప్రసాద్‌రాజు, అదనపు కమిషనర్లు డి.వి.రమణమూర్తి, ఎస్.ఎస్.వర్మ, కార్యనిర్వహక ఇంజనీరు రత్నాకర్‌రెడ్డి, ఉపకార్య నిర్వాహక ఇంజనీర్లు, సహాయక ఇంజనీర్లు పాల్గొన్నారు.

లాడ్జిలు, హోటళ్లలో ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి–ఎంవిపికాలనీ: విశాఖపట్నం పోలీస్‌కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సోమవారం రాత్రి 11 గంటల సమయంలో నగరంలోని జోన్-1, జోన్-2 పరిధిలో ఏకకాలంలో 74 లాడ్జిలు, హోటళ్లలో తనిఖీలు చేపట్టామని పోలీస్ అధికారులు తెలిపారు. ప్రధానంగా లాడ్జిలు, హోటళ్ల లో తప్పిపోయిన వ్యక్తులు ఎవరైనా ఉన్నారా, విదేశీ అతిథులు పాస్‌పోర్టు లేకుండా ఉన్నారా? హోటల్లో వ్యభిచార కార్యకలాపాల నిర్వహణ వంటి అంశాలను తనిఖీ చేశారు. హోటళ్లకు ఎన్ఒసి, ట్రేడ్‌లైసెన్స్, జిఎస్టి సర్టిఫికెట్లు ఉన్నాయా లేదా పరిశీలించారు. సిసి కెమెరాల ఫుటేజ్, విజిటింగ్ రిజిస్టర్లను తనిఖీ చేశారు. బసచేసేవారు ఎవరైనా గంజాయి, ఆయుధాలు, మందుగుడుసామగ్రి కలిగి ఉన్నారా వంటి అంశాలను తనిఖీ చేశారు. సరైన రికార్డులు లేని హోటళ్ళ, లాడ్జిల నిర్వాహకులపై ఆయా శాఖలకు నివేదికలు పంపుతున్నామన్నారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

నేడు చింతూరులో పోలవరం ఆర్అండ్ఆర్ గ్రామసభ

ప్రజాశక్తి– చింతూరు: పోలవరం ప్రాజెక్టు ఆర్అండ్ఆర్ గ్రామసభ చింతూరు మండల కేంద్రంలో పాత ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్నట్లు సబ్ కలెక్టర్ ఐటిడిఎ పిఒ అపూర్వ భారత్ మంగళవారం మైక్ ద్వారా ప్రచారం నిర్వహించారు. సభలో ఆర్ అండ్ఆర్‌కు సంబంధించిన సమస్యలు, వినతులు స్వీకరిస్తారన్నారు.

ప్రమాదకరంగా శబరి వంతెన


బ్రిడ్జిపై పగుళ్లు ఏర్పడిన దృశ్యం

ప్రజాశక్తి–చింతూరు: శబరినది వంతెనపై అడుగున్నర మేర మధ్యలో రంధ్రం ఏర్పడింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆర్అండ్‌బి అధికారులు స్పందించి మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

వాచ్‌మ్యాన్‌కు పూర్వ విద్యార్థుల ఆర్థిక సాయం

ప్రజాశక్తి–రాజవొమ్మంగి: మండలం లో జగ్గంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఇదే పాఠశాలలో 1987-88లో చదివిన పదోతరగతి పూర్వవిద్యార్థులు మంగళవారం తమ వంతు రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. పూర్వవిద్యార్థులకు వెంకటరావు కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.


ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

విద్యార్థులకు వేదాంతు శిక్షణ

ప్రజాశక్తి – ఎంవిపి.కాలనీ: ప్రముఖ విద్య శిక్షణా సంస్థ అయిన వేదాంతు తమ లెర్నింగ్ సెంటర్లను విస్తరించే క్రమంలో విశాఖపట్నం విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సంస్థ సీఈవో వంశీకష్ణ తెలిపారు. మంగళవారం సిరిపురంలోని ఒక ప్రైవేటు హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల వేదాంతు ఆఫ్‌లైన్ కేంద్రాల లెర్నింగ్ సెంటర్‌ను తిరుపతిలో ఏర్పాటు చేశామన్నారు. తమ సేవలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు రాష్ట్రంలోని 35 ఇతర నగరాల్లో శిక్షణ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నామని తెలిపారు. తమవద్ద ఆఫ్‌లైన్ కేంద్రాల్లో జెఈఈ, ఎన్ఈఈటి, స్టేట్‌బోర్డ్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు అత్యుత్తమ శిక్షణ అందిస్తామన్నారు. ఈ నెల 4వ తేదీన తిరుపతిలోని కచ్ఛపై ఆడిటోరియంలో వేదాంత విద్యాయాత్ర ప్రారంభించామని ఇది రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తామని ఆయన తెలిపారు.

ఎస్‌సి యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ

ప్రజాశక్తి–ఎంవిపి కాలనీ: ఎస్‌సి కార్పొరేషన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ అండ్ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ ద్వారా స్వల్పకాలిక నైపుణ్యాభివద్ధి ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎస్‌సి కార్పొరేషన్ ఈడి సత్యపద్మ, నాక్ డైరెక్టర్ రవికుమార్ మంగళవారం తెలిపారు. నాక్ శిక్షణ కేంద్రం, పెదగంట్యాడ, గాజువాకలో ఫ్రంట్ ఆఫీస్ అసోసియేట్ కోర్స్‌లో ప్రధానమంత్రి అనుశ్చిత్ జాతి అభ్యుదయ యోజన పథకం కింద ఇంటర్ ఉత్తీర్ణులై ఉండి18 నుంచి 40 సంవత్సరాల వయోపరిమితి గల ఎస్‌సి అభ్యర్థులు అర్హులన్నారు. శిక్షణ నాన్ రెసిడెన్షియల్ పద్దతిలో ఉంటుందని, శిక్షణ కాలంలో మధ్యాహ్నభోజనం, స్టేషనరీ ఉచితంగా అందజేస్తామని, శిక్షణ అనంతరం ప్రభుత్వ సర్టిఫికెట్ జారీచేసి, సంబంధిత రంగంలో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు 7981022453, 9063269849 నంబర్లలో సంప్రదించాలన్నారు.